విశాలాంధ్ర గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

గవర్నర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర - కాకినాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ కాకినాడ పర్యటన సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ పరిశీలించారు. ఈనెల 31వ తేదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా కాకినాడ జేఎన్టీయూ స్నాతకోత్సవ కార్యక్రమం విచ్చేస్తున్న సందర్భంగా గవర్నర్ పర్యటన జరిగే ప్రదేశాలను, స్నాతకోత్సవ ప్రాంగణాన్ని పరిశీలించి భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీసు బందోబస్తును వివిధ శాఖల అధికారులు, జేఎన్టీయూ అధికారులతో కలిసి పరిశీలించి ఎస్పీ తగిన సూచనలు చేశారు. ఎస్పీ స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్ హెలిప్యాడ్‌ను మొదలుకొని గవర్నర్ పర్యటించే మార్గాలు బస చేసే జేఎన్టీయూ ప్రాంగణంలోని అతిథి గృహం, స్నాతకోత్సవం జరిగే ప్రదేశాల వద్ద ఏర్పాటు చేసుకోవాల్సిన పోలీసు బందో బస్తును అడిషనల్ ఎస్పీ అడ్మిన్ పి.శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ ఏఆర్ బి. సత్యనారాయణలతో కలసి పరిశీలించారు. ఎస్పీ వెంట జేఎన్టీయూ కాకినాడ రిజిస్ట్రార్ సుమలత, రెక్టార్ రమణ, కాకినాడ డీఎస్పీ పి మురళీకృష్ణారెడ్డి, ఏఆర్ డిఎస్పి వెంకట అప్పారావు, పోలీస్ కంట్రోల్ రూమ్ ఇన్స్పెక్టర్ సిహెచ్ రామకోటేశ్వరరావు, ఇతర స్థానిక పోలీస్ అధికారులు ఉన్నారు.

కొబ్బరి పరిశోధనా కేంద్రం పరిశీలన

విశాలాంధ్ర - అంబాజీపేట : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో ఉన్న డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కొబ్బరి పరిశోధన కేంద్రాన్ని శనివారం బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు నల్లా పవన్ కుమార్ పరిశీలించారు. పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ బి. శ్రీనివాసరావును కొబ్బరిలో ఏర్పడ్డ తెగుళ్ళ గురించి, కొబ్బరి దిగుబడుల గురించి, కొబ్బరి తెగుళ్ళ నివారణ పద్ధతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పత్తి దత్తుడు, గోకరకొండ గంగన్నస్వామి, కోట బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : గత 20 రోజులుగా వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయం పాలకుడు కవి కొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కవికొండల మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర గ్రంథాలయ సంచాలకులు ఎమ్ఆర్ ప్రసన్నకుమార్ కుమార్ ఆదేశాలతో విద్యార్థులకు వేసవి సెలవుల్లో విజ్ఞానం అందించాలన్న ఉద్దేశంతో జూన్ 11వ తేదీ వరకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఒక పాఠ్యాంశానికి సంబంధించిన ఉపాధ్యాయులచే విద్యార్థు లకు బోధన చేయడం జరుగుతుందన్నారు. శనివారం ఉపాధ్యాయులు మజ్జి నాగేశ్వరరావు విద్యార్థులకు క్లాక్ (సమయం)గురించి వివరించి, పెరటిలో మొక్కలు వాటి ప్రాధాన్యత మొక్కల అవసరాలను ప్రతి ఒక్కరు గుర్తించాలని అన్నారు.

యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా బీసీలను నియమించాలి

విశాలాంధ్ర - కొత్తపేట : కృష్ణాజిల్లా, మచిలీపట్నంలో ఉన్న క్రిష్ణ యూనివర్సిటీ ఉపకులపతిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిని నియమించాలని బీసీ సేన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పొలిటికల్ జెఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టా వీరబాబుగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నత విద్యాలయాల్లో ప్రభుత్వం బీసీలకు సముచిత న్యాయం చేయలేదని సీనియారిటీ, రోల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటించడం లేదని తెలిపారు. రాష్ట్రంలో 22 యూనివర్సిటీలు రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండగా, వాటిలో ఎన్ని విశ్వవిద్యాల యాల్లో ఉపకులపతులుగా, రిజిస్ట్రార్లుగా, రెక్టార్లుగా ఉన్నారో ప్రభుత్వం గమని స్తుందా అని తెలిపారు. విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకొస్తామన్నారు. బలహీనవర్గాల వారికి ప్రభుత్వ విద్యను అందించేందుకు నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం విద్యాలయాల్లో ఉన్నత స్థానాల్లో బీసీలకు ఎందుకు అవకాశాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో యూనివర్సిటీల్లో ఉన్నత ఉద్యోగాల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని సీనియారిటీ, రిజర్వేషన్లు బీసీల విషయంలో పాటించాలని అలాగే కృష్ణ యూనివర్సిటీలో ఉపకులపతిగా బీసీలకే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

పుస్తక పఠనమే జ్ఞానానికి మూలం

విశాలాంధ్ర - కరప : పుస్తక పఠనమే జ్ఞానానికి మూలమని జిల్లా గ్రంథాలయ శాఖ ప్రధాన కార్యదర్శి వివిఎల్ఎన్ ప్రసాద్ పేర్కొన్నారు. కరప మండలం వేలంగి శాఖ గ్రంథాలయాన్ని శనివారం వరప్రసాద్ ఆకస్మికంగా సందర్శించారు. గ్రంథాలయ అధికారి పీవీ రంగయ్య ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులో పాల్గొని పిల్లలకు జ్ఞానబోధ చేశారు. విద్యార్థులు పుస్తక పఠనం ద్వారానే మంచి జ్ఞానం అలవర్చుకుంటారని, ప్రపంచ విజ్ఞానం గ్రంథాలయాలలోనే ఉందని విద్యార్థులు తప్పనిసరిగా గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

సారా బట్టీపై పోలీసుల దాడి

విశాలాంధ్ర - జగ్గంపేట : జగ్గంపేట శివారు పామాయిల్ తోటలో రహస్యంగా తయారు చేస్తున్న సారా బట్టి పై పోలీసులు దాడి చేశారు. సారా తయారు చేస్తున్నారనే సమాచారంతో జగ్గంపేట సిఐ బి. సూర్య అప్పారావు తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 200 లీటర్ల బెల్లపు ఊటను, తయారీకి వినియోగించే పనిముట్లను ధ్వంసం చేసి, 30 లీటర్ల సారాను, 2 గ్యాస్ సిలిండర్లు, గ్యాస్ స్టౌలను స్వాధీనం చేసుకున్నారు. సంఘటన స్థలంలో సారా తయారు చేస్తున్న వ్యక్తి పోలీసులను చూసి పారిపోవడంతో అతడిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. సారా తయారీకి పాల్పడుతున్న వ్యక్తి పై కేసు నమోదు చేయడం జరిగిందని సీఐ తెలిపారు. దాడుల్లో జగ్గంపేట ఎస్సై సిహెచ్ విద్యాసాగర్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

వలంటీర్ల కుటుంబాలకు సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - అంబాజీపేట : పి గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట మండలం, ఇసుకపూడి గ్రామ వాలంటీర్ కత్తుల శ్రీకృష్ణ, అయినవిల్లి మండలం, అయినవిల్లి గ్రామ పంచాయతీకి చెందిన వాలంటీర్ జనిపేల్ల దుర్గా ప్రసాద్‌లు ఇద్దరు మరణించి వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో పి గన్నవరం శాసన సభ్యులు కొండేటి చిట్టిబాబు ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి ఒక్కొక్కరి కుటుంబానికి 2 లక్షల రూపాయల చొప్పున ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరు చేయించారు. ఈ చెక్కులను శనివారం జిల్లా కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్‌లో పి గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సమక్షంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా కత్తుల శ్రీకృష్ణ భార్య కత్తుల సంధ్య, జనిపేల్ల దుర్గాప్రసాద్ భార్య జనిపేల్ల శ్రావణ సంధ్యకు అందజేశారు. ఈ సందర్భంగా వీరిద్దరికీ ఔట్సోర్సింగ్‌లో ఉద్యోగాలు ఇప్పించాలని పి గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను కోరగా ఔట్సోర్సింగ్‌లో ఉద్యోగం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

- బాలింతల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాల్సిన బాధ్యత అధికారులదే
- జిల్లా కలెక్టర్ డాక్టర్ మాధవీలత

విశాలాంధ్ర - రాజానగరం : రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఇళ్ళు, ప్రజల ఆరోగ్యం విషయంలో అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుందని,ఆ మేరకు క్షేత్ర స్థాయిలో ఫలితాలు చూపాలని,విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత అన్నారు.మండలంలోని పాలచర్ల హౌసింగ్ లేఅవుట్లను జిల్లా కలెక్టర్ శనివారం సందర్శించారు.అనంతరం పాలచర్ల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.దీనిలో భాగంగా వైద్య సిబ్బంది తీరు పై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో పి.హెచ్.సి వైద్యాధికారికి షోకాజ్ నోటీస్, హెడ్ నర్స్ సస్పెండ్‌కు సిఫార్సు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాల్సిన బాధ్యత వైద్య సిబ్బంది పై ఉందన్నారు. పాలచర్ల పిహెచ్‌సి పరిధిలో ఉన్న గర్భిణీలు, బాలింతలు, పిల్లల వివరాలు తప్పని సరిగా అందుబాటులో ఉండి, వారికి అందు తున్న వైద్య సేవల వివరాలు రికార్డ్ చెయ్యవలసి ఉంటుందన్నారు. ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందుతున్న సమాచారం ప్రజలకు చేరవేసే బాధ్యత తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో శిశు మరణాల రేటు,మాతృ మరణాల రేటు లేకుండా చర్యలు తీసుకోవలసిన అవసరం, బాధ్యత ఉందని కలెక్టర్ మాధవీలత తెలిపారు.

ఆ దిశలో ఏ నెలలో ఎంతమంది గర్భిణీల డెలివరీ తేదీ లతో కూడిన సమగ్ర సమాచారం పి హెచ్ సి, సిహెచ్ సి ల వారీగా తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జిల్లా హౌసింగ్ అధికారి జీ. పరుశురాం, తహశీల్దార్ ఎన్.ఎస్. పవన్ కుమార్,ఎలక్ట్రికల్ ఈఈ డేవిడ్, ఆర్‌డబ్ల్యూఎస్ డిఈ రవికుమార్,డిఈ పంచాయతీ రాజ్, ఏఈ ఎలక్ట్రికల్, వైద్య అధికారులు,వివిధ శాఖల అధికారులు తదతరులు పాల్గొన్నారు.

జగన్మోహన్ రెడ్డితోనే రాష్ట్రం అభివృద్ధి

విశాలాంధ్ర - పెద్దాపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తోనే రాష్ట్రం విధాల అభివృద్ధి సాధిస్తుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం పెద్దాపురం పట్టణంలోని శంకరయ్య పేట 12వ సచివాలయం పరిధిలో 22వ వార్డులో మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు,వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ,వార్డు కౌన్సిలర్ ముప్పన శ్యామలంబ, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకోవడమే కాకుండా, ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, టిపిఓ ఉమామహేశ్వరరావు, సానిటరీ ఇన్స్పెక్టర్ దావీదు రాజు, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

అపోలో ఆధ్వర్యంలో హెల్త్ ఎమర్జెన్సీ మెడిసన్ డే

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం వరల్డ్ హెల్త్ ఎమర్జెన్సీ మెడిసన్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆసుపత్రి జనరల్ మేనేజర్ ఐవి రమణ హాజరై మాట్లాడుతూ ప్రతీఒకరూ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాల్సిన అవసరముందని, ప్రతీ ఏటా వరల్డ్ ఎమర్జెన్సీడే నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఆరోగ్యంపై అవగాహన కలిగివుండడంతో పాటు సరైన సమయంలో చికిత్స తీసుకోవడంద్వారా రోగాల బారిన పడకుండా ఆరోగ్యవంతమైన జీవనాన్ని కలిగి వుండవచ్చని తెలిపారు. కార్డియాలజీ వైద్యుడు మహేష్ మాట్లాడుతూ నేడు గుండెపోటు అనేది సాధారణంగా మారిందని, పూర్తిగా గుండెకు రక్తం సరఫరాచేసే నాళాలు మూసుకుపోవడం, రెండుమూడు నాళాలు మూసుకుపోవడంతో గుండెవ్యాధికి కారణమన్నారు. మనదేశంలో తక్కువ వయసులోనే ఈ జబ్బు వస్తుందని, సరైన సమయంలో ఇంజెక్షన్ చేయడంద్వారా, స్టంట్‌లు వేయడంద్వారా గుండెపోటుబారిన పడకుండా రక్షించుకోవచ్చున్నారు. నెఫ్రాలజిస్టు గాంధీ మాట్లాడుతూ మెదడులో రక్తనాళాలకు సంబంధించి అడ్డుకట్ట వచ్చిన సమయంలో సరైన సమయంలో చికిత్స అందించడం ద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. ఎమర్జెన్సీ ఫిజిషియన్ ఎం.భువనాంజలి మెడికల్ ఎమర్జెన్సీలో వున్న దశలను వివరించారు. పాముకాటు, గాయాలు, రోడ్డు ప్రమాదాలు వంటివి జరిగినపుడు ఏవిధమైన ప్రథమ చికిత్సలు తీసుకుంటే ప్రాణాలను కాపాడగలరనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

పారదర్శకంగా అంగన్‌వాడీలఎంపిక

విశాలాంధ్ర - పెద్దాపురం : పెద్దాపురం సబ్ డివిజన్ పరిధిలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఆయా అంగన్వాడి ఆయా వర్కర్ల పోస్టుల నియామక ఎంపికను పారదర్శంగా నిర్వహించినట్టు పెద్దాపురం ఐసిడిఎస్, సిడిపిఓ జి. ఉష తెలిపారు. స్థానిక పెద్దాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఆయా పోస్టుల నియామకాలకు సంబంధించి ఎంపికైన

అభ్యర్థులకు శనివారం ఆమె చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సిడిపిఓ ఉష మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారికి నియామక పత్రాలు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సిడిపిఓ పద్మావతి యుడిసి బత్తుల మూర్తి తదితరులు ఉన్నారు.

అరబిందో మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - కాకినాడ : తొండంగి మండలం పెరుమాళ్ళపురంలో ఈ నెల 29,30, జూన్ 2వ తేదీలలో ఆరబిందో కాకినాడ సెజ్ పరిధిలోని గ్రామాల ప్రజల కోసం సామాజిక బాధ్యతగా ఈ నెల 29,30, జూన్ 2వ తేదీలలో ప్రముఖ వైద్యుల పర్యవేక్షణలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తుంది. ఈ వైద్య శిబిరంలో పరీక్షలు, మందులు ఉచితంగా అందిస్తారు. చర్మ, కంటి, పంటి సమస్యలకు వేరువేరుగా వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అరబిందో కాకినాడ సెజ్ కోరింది.

వాడి వేడిగా మండల పరిషత్ సమావేశం

విశాలాంధ్ర - కరప : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సమావేశం ఎంపీపీ పెంకి శ్రీలక్ష్మి సత్తిబాబు అధ్యక్షతన జరిగింది. మండలంలో జరుగు వివిధ అభివృద్ధి పనులపై ఎంపీడీవో కర్రె స్వప్న సమీక్ష నిర్వహించారు. ముందుగా వ్యవసాయ శాఖ అధికారి రాజేష్ మాట్లాడుతూ రైతులకు జూన్ 1వ తేదీ నాటికి నీటిని విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలలో స్వర్ణ విత్తనాలు అందుబాటులో ఉంచామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఈ హౌసింగ్ మాట్లాడగా సర్పంచులు, ఎంపీటీసీలు హౌసింగ్ నిర్మాణ లోన్లు రావడంలేదని ఏఈకి అడ్డు తగిలారు. దీంతో చేసేదేమీ లేక హౌసింగ్ అనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిదని మొత్తం ఆన్లైన్ ప్రాసెస్ కావడంతో ఆలస్యం అవుతుందని తెలిపారు. ఆర్ అండ్ బి అధికారి మాట్లాడగా మండలంలోని వివిధ బస్టాప్‌లలో వద్ద పల్లె వెలుగు బస్సులు సక్రమంగా ఆపడం లేదని స్కూల్ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచులు, ఎంపీపీ శ్రీలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా దీనిపై చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఎంఈఓ కృష్ణవేణి మాట్లాడుతూ 2023 సంవత్సరంలో పదో తరగతి 72%తో పాస్ అయ్యారని అకాడమీ పుస్తకాలు విద్యా వనరుల కేంద్రానికి ఇవ్వడం జరిగిందన్నారు. తహసీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు సర్టిఫికెట్ విషయాలలో జాప్యం లేకుండా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ భీమ శంకర్రావు, ఎలక్ట్రికల్ ఏఈ ప్రసాద్, పశుసంవర్ధక శాఖ ఏడి సురేష్ బాబు, కార్యదర్శులు సునీల్ కుమార్ బ్రహ్మానందం, నాగేంద్ర, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఖచ్చితమైన సమాచారంతో సమగ్ర సర్వే

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న నివాసాలు, కుటుంబాలు, వ్యాపార సంస్థలకు సంబంధించి ఖచ్చితమైన సమాచారంతో సమగ్రంగా సర్వే చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల ఆదేశించారు. 15 రోజుల వ్యవధిలో ఈ మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో మంగళవారం ఈ అంశంపై స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ అధికారులు, సచివాలయ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావుతో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధిలో ఎన్ని ఇళ్లు ఉన్నాయి? ఎన్ని కుటుంబాలు ఉన్నాయి? ఎన్ని వ్యాపార సముదాయాలు ఉన్నాయి? సదరు నివాసం అసెస్మెంట్ పరిధిలో ఉందా? లేదా? యూజర్ చార్జీలు చెల్లిస్తున్నారా? లేదా? వంటి సమాచారంతో సర్వే చేయాలన్నారు. ఏ ఒక్క ఇల్లు, కుటుంబం, వ్యాపార సంస్థను విడిచి పెట్టకుండా సర్వే పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. ఈ మొత్తం ప్రక్రియను 15 రోజుల వ్యవధిలో పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని కమిషనర్ సూచించారు. అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు మాట్లాడుతూ సర్వే ప్రక్రియను నోడల్ అధికారులు స్వయంగా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. సర్వేకు ఆయా సచివాలయాల అడ్మిన్లు, వాలంటీర్లు, ఇతర సిబ్బంది సంపూర్ణ సహకారం అందించాలని స్పష్టం చేశారు. జీఎస్‌డబ్ల్యూఎస్ డేటాకు, అసెస్మెంట్‌లకు, యూజర్ చార్జీలు చెల్లిస్తున్న వారికి మధ్య చాలా వ్యత్యాసం కనిపిస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం చేపడుతున్న ఈ సర్వే ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. వ్యాపార సంస్థలకు సంబంధించి ట్రేడ్ లైసెన్స్ ఉందో లేదో పరిశీలించాలన్నారు. నిర్ణీత ప్రొఫార్మా ప్రకారం సర్వేను పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం ఏసుబాబు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టిపిఆర్ఓ మానే కృష్ణమోహన్, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ సిరిల్, శానిటరీ సూపర్వైజర్లు జిలాని, రాంబాబు, పలువురు శానిటరీ ఇన్స్పెక్టర్లు, డీఈలు, ఏఈలు, ప్రత్యేక అధికారులు, నోడల్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

ఎన్టీఆర్ పై అభిమానం చాటుకున్న టీచర్

విశాలాంధ్ర - అనపర్తి : రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిన నటసార్వభౌమ నందమూరి తారక రామారావు శత జయంతి పురస్కరించు కుని డ్రాయింగ్ టీచర్ మండపల్లి సత్యానందం ఆయన చిత్రపటాలను అత్యంత సుందరంగా రూపొందించి తన అభిమానాన్ని చాటుకున్నారు. రామవరం నల్లమిల్లి మూలారెడ్డి జిల్లా పరిషత్ హై స్కూల్ కు చెందిన డ్రాయింగ్ టీచర్ సత్యానందం ఆయిల్ పేస్టల్, రంగు పెన్లతో అత్యంత అద్భుతంగా తీర్చిదిద్దిన ఎన్టీఆర్ చిత్రపటాలు అందరినీ విశేషంగా ఆకర్షించాయి.

పశువులను పరిశీలించిన ఉపసంచాలకులు

విశాలాంధ్ర - చాగల్లు : మండలంలోని గౌరిపల్లి గ్రామంలో శనివారం తెల్లవారుజామున సుమారు మూడు గంటల సమయంలో జరిగిన అగ్ని ప్రమా దంలో పశువులకు గాయాలయ్యాయి. కొవ్వూరు డివిజన్ ఉపాసంచాలకులు డాక్టర్ జి రాధాకృష్ణ పాడి రైతు పశువులను పరిశీలించి వైద్య సూచనలు, ఖనిజ లవణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చాగల్లు పశు వైద్యాధికారి డాక్టర్ ముఖేష్ పాల్గొన్నారు.

సాటి జర్నలిస్టును ఆదుకోవడం అభినందనీయం

విశాలాంధ్ర - కాకినాడ : కష్టాల్లో ఉన్న సాటి జర్నలిస్టును ఆదుకోవడం అభినందనీయమని కాకినాడ జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి డి. నాగార్జున్ అన్నారు. ప్రమాదంలో గాయపడిన హెచ్ఎమ్ టీవి కెమెరామెన్ సప్ప శ్రీనివాస్‌ను శనివారం జర్నలిస్ట్ యూనియన్ నాయకులు అల్లుమల్లు ఏలియా, షేక్ సలీమ్, మంగా వెంకట శివరామకృష్ణ ఆధ్వర్యంలో డిప్యూటీ డైరెక్టర్ నాగార్జున పరామర్శించారు. అల్లుమల్లు ఏలియా, షేక్ సలీమ్ సమకూర్చిన రూ.5 వేలు నగదు, 25 కేజీల బియ్యంను నాగార్జున్ చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేస్తున్న జర్నలిస్ట్ యూనియన్ నేతలను అభినందించారు. గాయపడ్డ కెమెరామెన్ పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఆదుకుంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ వాసంశెట్టి సూరిబాబు పాల్గొన్నారు.

క్రీడలు ప్రోత్సహించడం మంచి తరుణం

విశాలాంధ్ర - సీతానగరం : గ్రామాల్లో క్రీడలు ప్రోత్సహించడం చాలా మంచి తరుణం అని రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలో సీతానగరం గ్రామంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రతీ సవంత్సారం నిర్వహిస్తున్న ఎల్ఎమ్‌సి ఈ

ఏడాది ఆకస్మికంగా మరణించిన మట్ట శివాజీ మోనోరెయిల్ క్రికెట్ టోర్నమెంట్‌గా నిర్వహిం చారు. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్లో సీతా నగరం, నామవరం తలపడగా నామవరం గెలుపొంది ప్రథమ స్థానంలో నిలవగా సీతానగరం ద్వితీయ స్థానంలో నిలిచింది. గెలుపొందిన జట్లకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రథమ స్థానంకు 40వేలు, ద్వితీయ స్థానంకు 30వేల రూపాయలు బహుమతులతో పాటు కప్పులను అందచేశారు.

ఏపీ గవర్నర్‌ను కలిసిన నన్నయ వీసీ పద్మరాజు

విశాలాంధ్ర - రాజానగరం : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య కె.పద్మరాజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయాల కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ ను గవర్నర్ కార్యాలయంలో శనవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందుకు సబంధించి స్థానిక విలఖర్లలకు ఓ ప్రకటనలో తెలిపారు.దీనిలో భాగంగా నన్నయ వర్సిటీ ఉపకులపతిగా తనను నియమించినందు కు గవర్నర్ కి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తానని,వర్సిటీ అభివృద్ధి ప్రణాళికను గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వీసీ ఆచార్య కె.పద్మరాజుకు గవర్నర్ అబ్దుల్ నజీర్ శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రబాబును సత్కరించిన సత్యానందరావు

విశాలాంధ్ర - కొత్తపేట : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారకరామారావు శతజయంతిని పురస్కరించు కుని వేమగిరిలో జరుగుతున్న మహానాడు వేదికపై పార్టీ అధినేత చంద్రబాబునాయుడుకు దుశ్శాలువాతో కొత్తపేట టీడీపీ ఇన్‌చార్జి బండారు సత్యానందరావు సత్కరించారు. గోదావరి జిల్లాలో అత్యధిక శాతం వున్న రైతులకు గుర్తుగా నాగలిని చంద్రబాబు భుజాలపై మోపి చేతికి ఎండ్లబండిని నడిపే సమయంలో చేతిలో వుండే తోలికర్రను చేతికి అందించారు. గోదావరి రైతుల తరుపున చంద్రబాబునాయుడిని ఈ విధంగా సత్కరించామని సత్యానందరావు తెలియజేశారు.

వాడపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ప్రభుత్వ సలహాదారు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు గాది శ్రీధర్ రెడ్డి (స్కిల్ ట్రైనింగ్ & జాబ్ ఫెయిర్) కుటుంబ సభ్యులతో శనివారం దర్శించుకున్నారు. వీరికి దేవస్థాన చైర్మన్, ఆలయ అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజల మనస్సును గెలిచారన్నారు. ఈనేపథ్యంలోనే మళ్ళీ సీఎంగా జగన్మోహన్ రెడ్డిని చూడాలని స్వామివారిని కుటుంబ సభ్యులతో దర్శించుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగాన్ని రూపుమాపేందుకు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రతి నియోజకవర్గంలో స్కిల్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారని వివరించారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జాబ్ మేళాలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు భార్య, మిలీనియం సాఫ్ట్ వేర్ సొల్యూషన్ డైరెక్టర్ నల్లమిల్లి శ్రీవిద్య, కుమార్తె కాజలి, దేవస్థాన చైర్మన్, సూపరింటెండెంట్, ప్రధాన అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

చివటంలో ఫ్యామిలీ ఫిజిషియన్

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా చివటం లో వివిధ రకాల సమస్యలపై వచ్చిన 70 మంది రోగులకు పరీక్షలు నిర్వహించినట్లు ఉండ్రాజవరం పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ ఆర్ ప్రసాద్ తెలిపారు. వీరిలో హైపర్ టెన్షన్, డయాబెటిస్, మెల్లిటస్, బిపి, షుగర్ , జనరల్, ప్రసవానంతర పరీక్షలు, ఇళ్ళ వద్దకు వెళ్లి మంచం పట్టిన పేషంట్లను పరీక్షించినట్లు తెలిపారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి విజయ కుమారి, ఏఎన్ఎమ్ సూర్య కుమారి, డి ఈ ఓ శ్రవణ్, హెల్త్ అసిస్టెంట్ డి సుబ్రహ్మణ్యం, ఆశాలు విజయ, సుజాత, లక్ష్మీదేవి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పశువులపాక దగ్ధం

విశాలాంధ్ర - చాగల్లు : మండలంలోని గౌరిపల్లి గ్రామంలో శనివారం తెల్లవారుజామున సుమారు మూడు గంటల సమయంలో పాడి రైతు గుంటి నాగేశ్వరరావు తండ్రి గంగరాజు పశువుల పాకకు అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో పశువులపాక పూర్తిగా దగ్ధం అవ్వగా పాకలో ఉన్న ఒక గేదె, ఆవు మంటల్లో గాయపడగా.. గాయపడ్డ పశువులకు చాగల్లు పశు వైద్యాధికారి డాక్టర్ యు. ముఖేష్, మల్లవరం పశువైద్య అసిస్టెంట్ గౌతమ్ కుమార్ వాటికి చికిత్స అందజేశారు. ఈ ప్రమాదంలో సుమారుగా లక్ష రూపాయలు నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

విశాలాంధ్ర-కొవ్వూరు : కొవ్వూరు పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. చైర్పర్సన్ భావన రత్నకుమారి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సమావేశం జరిగింది. సందర్భంగా అజెండాలో చర్చకు వచ్చిన పలు అంశాలకు కౌన్సిల్ ఆమోద ముద్రవేసింది. అనంతరం చైర్పర్సన్ రత్నకుమారి మాట్లాడుతూ రెండు రోజుల క్రితం కొవ్వూరులో పర్యటించిన సీఎం జగన్ వచ్చిన సందర్భంగా మున్సిపల్ అధికారులు సిబ్బంది విశేష కృషి చేశారని వారి సేవలు పట్ల అభినందనలు తెలిపారు. సీఎం సభకు సభా వేదిక వద్ద లెవెలింగ్ పనులు, ఇతర పనులకు జిల్లా కలెక్టర్ విడుదల చేసిన నిధులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ కౌన్సిలర్లు హాజరయ్యారు. టిడిపి కౌన్సిలర్లు వేమగిరిలో మహానాడు ఉన్నందున సమావేశానికి హాజరు కాలేదు.

వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర-దేవరపల్లి : దేవరపల్లి శాఖా గ్రంథాలయం లో వేసవి విజ్ఞాన శిబిరం లో భాగంగా శనివారం స్పోకెన్ ఇంగ్లీష్ తరగతి నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరం ను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం. శేఖర్ బాబు ఆకస్మిక సందర్శన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుని భావి భారత పౌరులు కావాలని, పుస్తకం చదవడం వల్ల విజ్ఞానం పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ నాగాంబిక, గ్రంథ పాలకుడు కె.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

నీతి కథల పఠనంతో సత్ప్రవర్తన

విశాలాంధ్ర - చాగల్లు : నీతి కథలు పుస్తకాలు చదవడం వల్ల చెడు మార్గంలో నడవకుండా మనిషి జీవితంలో మంచితనంతో జీవించ వచ్చని చాగల్లు శాఖా గ్రంథాలయం గ్రంథ పాలకులు గద్దె శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవిజ్ఞాన శిబిరంలో శనివారం విద్యార్థిని విద్యార్థులకు పుస్తక పఠనం, నీతి కథలు చెప్పడం, తెలుగు వ్యాకరణ బోధన అనంతరం విద్యార్థులకు చదరంగం, క్యారమ్స్ ఆడించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ తెలుగు పండిట్ ఏబీఎన్ శాస్త్రి, గ్రంథాలయ అధికారి గద్దె శ్రీనివాసరావు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర- ఉండి: నిరుపేదల ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చెయ్యాలని జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి అధికారులను ఆదేశించారు.

శనివారం ఉండి మండలం చెరుకువాడ లే అవుట్ రహదారి పనులు జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ నెల చివరి నాటికి రహదారి నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. యంపిడివో కార్యాలయంలో ప్రత్యేక అధికారి, మండల అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లతో జిల్లా కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, లే అవుట్ లలో మౌలిక వసతులు త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ప్రత్యేక అధికారి, తహశీల్దారు, యంపిడివో, గృహనిర్మాణ శాఖ అధికారులు గృహనిర్మాణ పనులు ఎక్కడ మందకోడిగా సాగుతున్నాయో వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు, సచివాలయ ఇంజనీరింగు సిబ్బంది క్షేత్ర స్థాయిలోనే ఉండి ఇండ్ల నిర్మాణాలు పై దృష్టి పెట్టాలన్నారు. లబ్ధిదార్లను కలసి వారి కున్న సమస్యలు తెలుసుకుని వారి మనో భావాలకు అనుగుణంగా త్వరితగతిన ఇండ్ల నిర్మాణాలు పూర్తి చెయ్యాలన్నారు. ఇప్పటివరకు ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టని లబ్ధిదార్లను కలుసుకుని అవగాహన కల్పించి వారిని ఇళ్ళ నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలని జిల్లా కలెక్టరు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి, జిల్లా కో ఆపరేటివ్ అధికారి యం.రవి కుమార్, గృహ నిర్మాణ శాఖ ఇఇ బి. వెంకట రమణ, డిప్యూటీ తహశీల్దారు యస్ వి యస్ నాయుడు , యంపిడివో ఏ.వి అప్పారావు, గృహ నిర్మాణ శాఖ డిఇఇ పి.శివ రామరాజు, డిజిటల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా

విశాలాంధ్ర - నిడమర్రు: నిడమర్రు మండలం చానమిల్లి గ్రామ ప్రజలు త్రాగునీరు సమస్యతో ఇబ్బంది పడుతున్నారని జనసేన నాయకులు తెలియచేయగా వెంటనే స్పందించి శ్రీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ట్యాంకర్ ద్వారా ఎల్లమ్మ చెరువు ప్రాంత ప్రజలకు 6వ రోజు తాగునీరును సరఫరా చేసిన ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్ చార్జ్ పత్సమట్ల ధర్మరాజు ఆర్థిక సహకారంతో త్రాగునీరు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు గౌతు వెంకన్న బాబు, బెతు మురళీ, గ్రామ జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు కంటి విషయంలో జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం కాశిపాడు గ్రామంలో డాక్టర్ వై యస్ ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామంలో అర్హులైన 60 సంవత్సరాలు దాటిన వృద్ధులకు 73 మందికి నేత్ర వైద్యాధికారి ఐ.శ్రీనివాస్ కంటి పరీక్షలు నిర్వహించి,అందరికీ కళ్లజోళ్లు ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ఈ సంద ర్భంగా పిప్పర పి. హెచ్.సి వైద్యాధికారిణి డాక్టర్ కె.ప్రియాంక మాట్లాడుతూ షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రతి రెండు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించు కోవాలని కంటి పట్ల శ్రద్ధ వహిస్తూ చాలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు జంపన పద్మావతి, రమేష్ రాజు,గ్రామ వై యస్ ఆర్ పార్టీ నాయకుడు చిన్నం సిల్వెస్ట్ రాజు ,సొసైటీ కార్యదర్శి ఐ.రామకృష్ణ రాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి ఆర్‌డి రామారావు, పి.ఎం.పి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఏ ఆర్ కె పరమేశ్వర్లు, సి. హెచ్. ఒ. జె.విల్సన్ బాబు, ఆరోగ్య సహాయకుడు నామాల రాజు,రమ్య,మేరి గోల్డ్, ఆశ కార్యకర్తలు టి. వర లక్ష్మీ, సి.హెచ్. కృష్ణ కుమారి వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

అష్టావధానం కళా సంస్కృతికి నిదర్శనం

విశాలాంధ్ర-ఆకివీడు : అష్టావధానం కళా సంస్కృతికి నిదర్శనమని దత్తపిత స్వర్ణ కంకణ సత్కార గ్రహీత శ్రీ తాతా సందీప్ శర్మ అవధాని అన్నారు. శనివారం ఆకివీడు మండలంలోని మాదివాడ శ్రీ మల్లేశ్వర స్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు జరిగిన అష్టావధాన కార్యక్రమ ఆహ్వానంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లంక నాగ శశికళ అధ్యక్షతన. దేవస్థానం చైర్మన్లు గునుకుల కొండయ్య, మోటుపల్లి రాజు ఆధ్వర్యంలో భక్తులను, గ్రామ ప్రజలను ఆకట్టుకునే విధంగా అష్టావధాన కార్యక్రమం కొనసాగింది. అష్టవదానులు వేసిన ప్రశ్నలకు ఎంతో చాకచక్యంగా అవధాని సందీప్ శర్మ సమాధానమిచ్చి అందరి మన్నలు పొందారు. అనంతరం దేవస్థాన అర్చకులు లంక ప్రసాద్ దంపతులు అవధానులను సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పురిఘళ్ళ రఘురాం, చిట్టావురి సూర్యనారాయణ మూర్తి, రామకృష్ణారావు, సుదర్శనం ఫణి కుమార్, కడిమెళ్ళ విరించి, పసుపులేటి రామచంద్రరావు, కాకర్ల రాజేశ్వరి, తేనేటి మాస్టారు, డివి రమణమూర్తి, ఎర్ర రఘురాంతో పాటు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి మానవతా శాఖ ముందు ఉంటుందని కొయ్యలగూడెం మానవతా శాఖ సంస్థ సభ్యులు పేర్కొన్నారు. కొయ్యలగూడెం గ్రామానికి చెందిన అరేటి మంగరాజు కుమారుడు సురేష్ లారీ ప్రమాదానికి గురై కాలు సగ భాగం తీసివేయడం తో ఇంటి వద్దనే ఉంటున్న సురేష్‌కు మానవతా శాఖ తరపున 3000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందచేసారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థల వారు ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నక్క బాబి, నిడదవోలు రామారావు, ముప్పనపల్లి వెంకటేశ్వర రావు, దొడ్డా వీరాజు, వి ఎస్ ఎన్ స్వామి పాల్గొన్నారు.

మహానాడుకు తరలివెళ్లిన నాయకులు, కార్యకర్తలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : తెలుదేశం పార్టీ వ్యవస్థాపకులు కీ.శే. నందమూరి తారక రామారావు శతజయంతి సందర్భంగా రాజమహేంద్రవరంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మహానాడు కార్యక్రమానికి కొయ్యలగూడెం గ్రామం నుంచి పోలవరం నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ కన్వీనర్ బోరగం శ్రీనివాస్, పోలవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారెపల్లి రామారావు, మండల అధ్యక్షులు పారెపల్లి నరేష్, పట్టణ అధ్యక్షులు జేష్ఠ రామకృష్ణ,మొగపర్తి సోంబాబు,సుంకవల్లి సాయి,జిల్లా అధికార ప్రతినిధి జరం. చాందిని,యంత్రప్రగడ శ్రీనివాస్,ఉండవల్లి సోమసుందరం,తదితరులు వెళ్లారని నరేష్ తెలిపారు.

మట్టి టిప్పర్ల జాతర

తహసీల్దారు కార్యాలయం చెంతనే... చర్యలు శూన్యం

విశాలాంధ్ర-మండవల్లి: వేసవి వచ్చిందంటే చాలు.. మట్టి తోలకాలు పండుగలాగా సాగటం మండవల్లి మండలంలో పరిపాటిగా మారిపోతోంది. నిబంధనలకు తూట్లు పొడుస్తూ మైనింగు శాఖ అనుమతులు లేకుండానే ఇష్టారాజ్యంగా మట్టి టిప్పర్లలోను, ట్రాక్టర్లలోను తరలిపోతోంది. చిగురుకోట, అయ్యవారిరుద్రవరం నుండి పెద్ద ఎత్తున మట్టి ఎగుమతి సాగుతుండగా నిర్వాహకులకు లక్షలాదిరూపాయలు ఆదాయం సమకూరు తోంది. టిప్పర్లు, ట్రాక్టర్ల ధాటికి కోట్లాది రూపాయలతో నిర్మాణం చేపట్టిన రహదారులు పూర్తిగా గతుకుల మయంగా మారుతున్నాయి. ఇప్పటికే చావలిపాడు,భైరవపట్నం గ్రామాల్లో చెరువులను పూడ్చివేయగా సచివాలయ ,రెవిన్యూ అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కాని ప్రశ్నగానే ఉంది. తాజాగా మండవల్లి గ్రామంలో తహసీల్దారు కార్యాలయం చెంతనే రైల్వే స్థలంలో చిగురుకోట నుండి మట్టిని టిప్పర్లతో తీసుకుని వచ్చి పూడిక చేస్తున్నారు. రేయింబవళ్లు మట్టి టిప్పర్లు మితిమీరిన వేగంతో గ్రామంలో తిరగటంతో వాహనదారులు, పాదచారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎటువంటి మైనింగు బిల్లులు లేకుండానే పదుల సంఖ్యలో టిప్పర్లు మట్టిని తరలిస్తున్నా అధికారుల్లో చలనం రాకపోవటం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వాదాయానికి గండి కొడుతూ తోలకాలు సాగు తుండటంతో అధికారులకు నెలవారి మామూళ్ళు నిర్వాహకులు అందిస్తు న్నారని ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి.

మండల రెవిన్యూ కార్యా లయం సమీపంలోనే పూడికలు జరుగుతున్నా నిబంధనలు పాటిస్తున్నారో లేదో పట్టించుకున్నవారే కరువయ్యారు. మట్టి తోలకంపై తహసీల్దారును వివరణ కోరగా తన దృష్టికి వచ్చిందని అనుమతి పత్రాలు తీసుకు రమ్మన్నామని తెలిపారు. మట్టి తోలకాలు మాత్రం యథాలాపంగా సాగటం విశేషం.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర-ఏలూరు : అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఒక వ్యక్తిని ఏలూరు టూ టౌన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఇతని వద్ద నుంచి రు 2.40 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఒక వ్యక్తి పరారయ్యాడు. ఏలూరు టూ టౌన్ సిఐ ఈ .శ్రీనివాసులు కథనం ప్రకారం.. స్థానిక తంగెళ్ళమూడి శివగోపాలపురం నకు చెందిన జూలూరు శేషగిరిరావు, జూలూరు గణేష్ లు సోదరులు.వీరిద్దరూ గుట్కా వ్యాపారం చేస్తుంటారు.వీరి వద్ద డ్రైవర్లుగా పనిచేసిన గేదెల సతీష్, రాగి ,నాగేశ్వరరావు లు కూడా గుట్కా వ్యాపారం చేసేవారు. కరోనా కారణంగా వ్యాపారం ఆపేసారు. మళ్లీ ఇప్పుడు వ్యాపారం ప్రారంభించారు.అయితే వీరి వద్ద ఎవరు గుట్కా కొనుగోలు చేయడం లేదు. జూలూరు శేషగిరిరావు జూలూరు గణేష్ వద్ద మాత్రమే కొంటున్నారు. జూలూరు బ్రదర్స్ వ్యాపారాన్ని దెబ్బతీయాలని గేదెల సతీష్, రాగి నాగేశ్వరరావు అనుకున్నారు.గంజాయి కేసులో జూలూరి అన్నదమ్ములను ఇరికించాలని అనుకున్నారు. ఇందుకోసం గేదెల సతీష్ ,రాగి నాగేశ్వరరావు కలిసి ఎక్కడి నుంచో గంజాయిని మోటార్ సైకిల్ పై తీసుకువస్తుండగా ఏలూరు టూ టౌన్ పోలీసులు తంగెళ్ల మూడి వద్ద వారిని పట్టుకున్నారు.రాగి నాగేశ్వరరావు పోలీసులకు దొరికిపోయాడు. గేదెల సతీష్ పరారయ్యాడు. పట్టుబడిన రాగి నాగేశ్వరరావు వద్ద నుంచి పోలీసులు రు.2.40 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పరారైన గేదెల సతీష్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర - అనపర్తి : మండుతున్న ఎండలకు అల్లాడుతున్న పాదచారులు, వాహనదారులకు స్థానిక కెనాల్ రోడ్డులోని బగళాముఖి దేవి ఆలయం వద్ద కర్రి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మజ్జిగ పంపిణీ చేసి దాహార్తిని తీర్చారు.సుమారు 1000 మంది మజ్జిగ సేవించి తమ దాహార్తిని తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సత్తి సంతోష్ రెడ్డి, కర్రి శ్రీకాంత్ రెడ్డి, సత్తి అవినాష్ రెడ్డి, ఓగిరెడ్డి వెంకట రామారెడ్డి, గొలుగూరి కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో కీలకపాత్ర పండిట్ నెహ్రూ

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం భారతదేశ తొలిప్రధాని పండిట్ జవహర్‌లాల్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆకుల వెంకటరమణ మాట్లాడుతూ తొలిప్రధానిగా నెహ్రూ అనేక సంస్కరణలు తెచ్చి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాగార్జునసాగర్, శ్రీశైలండ్యాంతోపాటు పలు విశ్వవిద్యాలయాలు తీసుకువచ్చి దేశాభివృద్ధిలో కీలకపాత్ర వహించారన్నారు. ఈ సందర్భంగా నెహ్రూచిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి రాజు, పులగల రాజు, కంభం రాజబాబు, ధనకోటి, అర్జున్, వల్లూరి రామ్మోహన్, బి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబాన్ని పక్కన పెట్టి పార్టీ అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర - తణుకు : తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు పార్టీ జెండాను తమ భుజాలపై మోస్తూ , కుటుంబ సౌఖ్యాలను కూడా పక్కన పెట్టి అన్ని వేళల పార్టీని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వుంటారని తణుకు నియోజకవర్గ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు.రాజమహేంద్రవరంలో జరుగుతున్న మహానాడు వేదిక పై శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు.పార్టీ కోసం ప్రాణాలు కూడా పణంగా పెట్టే కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ సొంతం అని చెప్పడానికి గర్విస్తున్నానన్నారు. అందుకే తెలుగు దేశం అనేది ఒక్క రాజకీయ పార్టీ కంటే కోట్లాదిమందితో కూడిన అతి పెద్ద ఉమ్మడికుటుంబంగా ఉంటూ అందరితో ఆత్మీయానుబంధం ముడిపడింది అన్నారు. గడచిన సంవత్సర కాలంలో ఎంతోమంది మన కుటుంబ సభ్యులు, ఆత్మీయులు వివిధ కారణాల వల్ల మృతి చెందడం వారిని మనం కోల్పోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మహానాడు వేదికగా మనకి దూరమైనటువంటి మన కుటుంబ సభ్యులను స్మరించుకునే తీర్మానాన్ని ప్రవేశ పెట్టే అవకాశం తనకు ఇచ్చినటువంటి తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకులు లోకేష్ బాబు , రాష్ట్ర అధ్యక్షులు సోదరులు అచ్చం నాయుడు , వేదికని అలంకరించినటువంటి మన కుటుంబ పెద్దలకి, వేదిక ముందర ఉన్నటువంటి మన కుటుంబ సభ్యులందరికి పేరు పేరున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు.

తూతూ మంత్రంగా రౌతులపూడి మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - రౌతులపూడి : సగం ఎంపీటీసీ సభ్యులు కూడా సమావేశానికి హాజరుకాని వైనం. సరియైన సమాచారం లేకుండా సమావేశానికి హాజరైన అధికారులు. సమావేశంలో కూర్చోకుండానే వెనుదిరిగిన జెడ్పీటీసీ. ఇదీ శనివారం జరిగిన రౌతులపూడి మండల సర్వసభ్య సమావేశం తీరు. మండల పరిషత్ అధ్యక్షురాలు గంటిమల్లి రాజ్యలక్ష్మి అధ్యక్షతన మండల అభివృద్ధి అధికారి ఎం. గోవిందు నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖలపై సమీక్ష చేపట్టగా వివిధ శాఖల అధికారులు సమావేశంలో చర్చించి ఆయా శాఖాపరమైన విషయాల నివేదికను సమర్పించకపోవడంతో మండల అభివృద్ధి అధికారి గోవిందు ప్రతి సర్వసభ్య సమావేశంలోనూ సంబంధిత శాఖ అధికారులు సమావేశంలో చర్చించే నివేదికను సమర్పించాలని అధికారులకు సూచించారు. సమీక్షలో భాగంగా మండల విద్యాశాఖ అధికారి ఎస్‌వి నాయుడు మాట్లాడుతూ జూన్ 12వ తేదీన విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతుందని అదే రోజున మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని 4,500 విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అనంతరం వ్యవసాయ అధికారి రెడ్డి ఈశ్వరరావు సమీక్షలో భాగంగా ఏ మల్లవరం, రాఘవపట్నం, ఎస్ పైడిపాల, రౌతులపూడి రైతు మిత్ర గ్రూపులకు ట్రాక్టర్లు అందజేసినట్టు తెలిపారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ, పశుసంవర్ధక శాఖ, అటవీశాఖ అధికారులు సమీక్ష నిర్వహించారు. రౌతులపూడి జడ్పిటిసి సభ్యులు గొల్లు లక్ష్మణమూర్తి తనకు కుర్చీ కేటాయించలేదని కూర్చోకుండానే సభ నుండి వెనుకకు వెళ్లారు వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు మరియు గ్రామ సర్పంచులు కొందరు హాజరు కాకపోవడంతో సభ శోభను కోల్పోయింది. డిప్యూటీ తాసిల్దార్ పివి సత్యనారాయణ జెడ్పిటిసి సభ్యులు గొల్లు లక్ష్మణమూర్తి, కోఆప్షన్ మెంబర్ చింతకాయల వీర వెంకట సత్యనారాయణ వివిధ గ్రామాల ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు బీజేపీ

విశాలాంధ్ర - రాజానగరం : కమశిక్షణకు మారుపేరు గా భారతీయ జనతా పార్టీ ఉంటుందని,అందుకు అనుగుణంగా ప్రతి కార్యకర్త,నాయకులు క్రమశిక్షణతో వ్యవహరించవలసిన అవసరం ఉందని బిజెపి జిల్లా అధ్యక్షులు బొమ్ముల దత్తు అన్నారు.మండలంలోని శ్రీకృష్ణపట్నం గ్రామంలో మండల బీజేపీ అధ్యక్షులు పేపకాయల కాశీ అధ్యక్షత నిర్వహించగా,జిల్లా కార్యవర్గ సభ్యులు దొడ్డ అర్జున్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన నియోజకవర్గం స్థాయి కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.మరో అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి మాట్లాడుతూ నాయకులు ప్రతి ఒక్కరు బూత్ కమిటీలు వేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పథకాలు,విజయాలు వివరించారు. ఈ సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ ఏపీ.చౌదరి, నాయకులు మోదీ సత్తిబాబు,బోయిడి దుర్గారావు,అడబాల గణపతి రావు, మద్దుల సత్యనారాయణ,బొమ్మల సతీష్,తదితర నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

జూన్ 8న విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - అనపర్తి : కోట్లాది రూపాయల వ్యయంతో సర్వాంగ సుందరంగా, శిల్ప శోభాయమానంగా జీరుణోద్ధరణ గావింపబడిన స్థానిక శ్రీ శ్రీదేవి భూదేవి సమేత జనార్థన స్వామి దివ్య ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహా సంప్రోక్షణ టీటీడీ వైఖానసాగమ పండితులతో వైభవంగా నిర్వహించనున్నట్లు నూతన విష్ణాలయ నిర్మాణ కమిటీ తెలిపింది. జూన్ 8న ఉదయం 7:42 కు యంత్ర స్థాపన, సహిత బింబస్థాపన, పంచాహ్నిక దీక్షతో దైవజ్ఞులచే సుముహూర్తం నిశ్చయింపబడిందని కమిటీ తెలిపింది. అదేవిధంగా స్వామి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ట మహా సంప్రోక్షణ కార్యక్రమంలో భాగంగా జూన్ 4, 5,6,7 తేదీల్లో సంకల్ప దీక్ష కంకణం, గ్రామోత్సవం, విశ్వక్సేన పూజ పుణ్యాహం, అధి వాస హెూమం, అగ్ని ప్రణయనం, కలశారాధన వంటి కార్యక్రమాలు నిర్వహించబడతాయని ఆలయ ప్రధాన అర్చకులు (రాము) వివరించారు.యాజ్ఞిక నిర్వహణ ప్రొఫెసర్ వేదాన్తం శ్రీ విష్ణు భట్టాచార్యులు (తిరుపతి), బ్రహ్మశ్రీ మిక్కిలి దుర్గయ్య శాస్త్రి (పెద్దాడ) పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాము తెలిపారు.

చాగల్లులో ఘనంగాఎన్టీఆర్ శత జయంతి

విశాలాంధ్ర - చాగల్లు : చాగల్లు మెయిన్ బజార్లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శత జయంతిని శనివారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అల్లాడి సుబ్బారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబటి పెద్దబ్బులు తదితరుల ఆధ్వర్యంలో స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రాజమండ్రిలో జరుగుతున్న మహానాడు మహాసభకు ఆదివారం భారీ ఎత్తున తరలి వెళు న్నట్లు అని తెలిపారు.

ఉండ్రాజవరంలో వలంటీర్లకు వందనం

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: మండలంలోని ఉండ్రాజవరంలో శనివారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిడదవోలు ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు సారధ్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంకితభావంతో సేవలందిస్తూ గ్రామ వాలంటీర్లు అవార్డులు కైవసం చేసుకుంటున్నారన్నారు. మొదటి విడతగా వేలివెన్ను, కాల్దారి, పసలపూడి, సూర్యారావు పాలెం, చిలకపాడు, వడ్లూరు, సత్యవాడ గ్రామాల వాలంటీర్లకు అవార్డులు ప్రధానం చేశారు. మొదటి తేదీ తెల్లవారుజామునే పింఛనందిస్తున్న వాలంటీర్లను తమ కుటుంబ సభ్యులుగా పెన్షన్ దారులు భావిస్తున్నారన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులు వాలంటీర్లన్నారు. వాలంటీర్లు సేవా భావంతో పనిచేస్తూ కేటగిరి వారీగా సేవా మిత్ర, సేవారత్న, సేవావజ్ర లు గా గుర్తించి, ప్రభుత్వం అవార్డులు అందించి, ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, జడ్పిటిసి నందిగం భాస్కర రామయ్య, వైస్ ఎంపీపీలు, షాజహాన్, ఆయా గ్రామ సర్పంచులు, కొఠారు సత్యనారాయణ, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో, ఈఓపిఆర్డి, అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-ముదినేపల్లి : అంగన్‌వాడీ కేంద్రాలలో వివిధ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఓ డి.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. మండవల్లి సెక్టార్ పరిధిలో ముదినేపల్లి మండలం చిగురుకోట చేవురుపాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో చేవూరుపాలెంలో టీచర్ (బిసి-బి) , చిగురుకోట కేంద్రంలో సహాయకురాలు (జనరల్) 21 సంవత్సరాలు నుండి 35 సంవత్సరాల వయసులోపు వారై ఉండాలి. పదో తరగతి ఉత్తీర్ణులైన ఆసక్తి గల మహిళలు తమ ధ్రువీకరణ పత్రాలతో జూన్ 2న స్వయంగా రెండు సెట్లు దరఖాస్తులు మండవల్లి సెక్టార్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

వలంటీర్లకు సేవా పురస్కారాలు

విశాలాంధ్ర-కలిదిండి: జగనన్న వారియర్లుగా విశేష సేవలను అందిస్తున్న గ్రామ వాలంటీర్లకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అందుకుని ప్రభుత్వానికి పేరు తెచ్చేలా పనిచేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డులో వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వాలంటీర్ల శ్రమను గుర్తించి గౌరవించే క్రమంలో గత మూడేళ్లుగా ఈ సన్మానాలు, పురస్కారాలు వలంటీర్లకు ప్రభుత్వం అందిస్తుందన్నారు. సేవ వజ్రలు, సేవా రత్నాలు, సేవా మిత్రులుగా పురస్కారాలు అందుకుంటున్న ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నామన్నారు. రానున్న రోజులలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు. గ్రామ సచివాలయాలలో వాలంటీరుగా పనిచేస్తున్న వారిని వేదికపైకి ఆహ్వానించి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బొర్రా. సత్యవతి, ఎంపీపీ చందన. ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీలు కనకదుర్గ రాణి, నాగలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ ఐనాల బ్రహ్మాజీ, వైస్ చైర్మన్ పాము. రవికుమార్, సర్పంచి పసిముక్కుల మారుతి ప్రసన్న, నంబూరి. శ్రీదేవి, వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు తిరుమాని రమేష్, ఇన్చార్జ్ ఎంపీడీవో శ్రావణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఉదయ్ కుమార్, శివన్నారాయణ, నాగబాబు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణానికి ముప్పు రసాయనిక సాగు

తగ్గుతున్న భూసారం- అంతరిస్తున్న సేంద్రీయసాగు

విశాలాంధ్ర-మండవల్లి : సారవంతమైన పంట భూములు రైతుల అవగాహనా లేమితో నిస్సారంగా మారుతున్నాయి.అధిక పంట ఉత్పత్తి చేయాలనే ఆదుర్దాతో రైతుల అవసరం లేకున్నా రసాయనిక ఎరువులు వాడి సేంద్రీయ సాగుని విడిచిపెట్టేయటంతో భూముల్లో రసాయనిక అవశేషాలు పెరిగి పంటల ఉత్పత్తులు జనారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గతంలో రైతులు ఒకే పంటను సాగు చేసినా వరి సాగుతో పాటు పాడి పశువుల పెంపకాన్ని అత్యంత శ్రద్ధగా నిర్వహించేవారు. ఇంటిల్లపాది గేదెలు ,ఆవులు ఉండటం అవి ఇచ్చేపాలను తాగి ఆరోగ్యంగా అప్పటి వారుండేవారు.పశువుల వ్యర్ధాలను పంటభూములకు తరలించి పూర్తిగా సేంద్రీయ పద్దతిలోనే సాగు చేపట్టేవారు.కాలక్రమేణా జనాభాపెరగటం ఆధునిక పద్ధతుల్లో భాగంగా యంత్రాలు రావటం స్వల్పకాలిక రకాలు అందుబాటులోకి రావటం రెండు పంటల సాగు విస్తరించటంతో పశుపోషణపై రైతాంగం నిర్లిప్తత కనబరిచారు.పశువుల కాపరులు సైతం అందుబాటులో లేక పోవుటంతో పశువులను మేపలేక ఎక్కువ మంది బడా రైతులు తమ భూముల్లోకి సేంద్రీయ పదార్ధాన్ని తరలించలేకపోతున్నారు.

సేంద్రీయ పదార్థాలు భూమిలో తక్కువగా ఉండటంతో పైరుల్లో తెగుళ్ళు,పురుగుల సమస్యలు ఎక్కువయ్యాయి.రైతుల అవసరతను సొమ్ము చేసుకునేందుకు ఎరువుల దుకాణాలు విస్తరించటం వ్యవసాయ అధికారుల సేవలు పరిమితంగా ఉండటం,రైతుల్లో ఎక్కువ మంది నిరక్షరాస్యులుండటంతో ఎరువుల డీలర్లు తమ హవాని కొనసా గిస్తూ రైతుల్ని దోచుకుతింటున్నారు. అక్కడక్కడా పలువురు రైతులు పచ్చిరొట్ట పైర్లను పెంచుదామని భావించినా సకాలంలో విత్తనాలు దొరకక పోవటం అవి అందరికి చేరకపోవటం ఒక్కో సారి విత్తనాలు ఉన్నా సకాలంలో భూమిలో తేమ లేక విత్తనాలు వేయలేకపోవటం ఒక వేళ విత్తుచల్లినా పైరు పూత దశలో భూమిలో కలియ దున్నటానికి కాలువల ద్వారా నీరు సకాలంలో రాకపోవటం వంటి విపత్కర పరిస్థితులను రైతులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. అధిక దిగుబడులు సాధించాలనే అత్యుత్సాహం, ఎక్కువ మంది సాగుదారులు కౌలు దారులు కావటం కూడా రసాయనిక సాగు పెరగటానికి కారణంగా ఉంది. ఇటీవలి కాలంలో రైతులను చైతన్యం చేయటానికి వ్యవసాయ శాఖ వారు ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నా వాటి ఫలితాలందరి రైతులకు చేరటంలేదు. మండల స్థాయిలోనే కాకుండా నేడు గ్రామ స్థాయిల్లోను ఆర్బీకెలలో వ్యవసాయ శాఖ సిబ్బంది అందుబాటులో ఉంటున్నా పంట భూములు చేపల చెరువులుగా మారుతున్నాయంటే రైతులకు సాగులో ఆటుపోట్ల వల్ల వరి సేద్యంపై మక్కువ తగ్గుతుందనే చెప్పాలి. ఇప్పటికే బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు చుక్కలు చూపుతున్నాయి. కొద్ది పాటి వరి సాగునైనా సేంద్రీయ పద్ధతిలో నిర్వహించేలా ప్రభుత్వాలు రైతులకు రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాలని రసాయనిక ఎరువుల వినియోగం తగ్గితే భూసారం పెరగటమేకాక ప్రజారోగ్యా నికి, పర్యావరణానికి మేలు జరుగుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.